# 101. అల్ ఖారిఅహ్ (మహోపద్రవం) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 11 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా తీర్పుదినం గురించి వివరించింది. ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చింది. తీర్పుదినం నాటి భయానక పరిస్థితులను ఇందులో వివరించడం జరిగింది. ఆ రోజున తీవ్రమైన ప్రకంపనాలు సంభవిస్తాయి. పర్వతాలు దూదిపింజల్లా ఎగురుతాయి. మానవులు దిక్కుతోచని స్థితిలో నిస్సహాయంగా చెల్లాచెదరయిన దీపపు పురుగుల్లా కనబడతారు. చేసిన కర్మలకు తగిన విధంగా శిక్షా లేదా బహుమానాలు ఆ రోజున లభిస్తాయి.

## 101. అల్ ఖారియహ్ సూరా

سُورَةُ القَارِعَة

అవతరణ :మక్కా ఆయతులు : 11

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 ఎడా పెడా బాదేది.

الْقَارِعَةُ ①

2 ఏమిటీ, ఆ ఎడా పెడా బాదేది?[1]

مَا الْقَارِعَةُ ②

3 ఆ ఎడా పెడా బాదే దాని గురించి నీకేం తెలుసు?

وَمَا أَدْرٰكَ مَا الْقَارِعَةُ ③

4 ఆ రోజు మనుషులు చెల్లాచెదురైన దీపపు పురుగుల్లా అయిపోతారు.[2]

يَوْمَ يَكُوْنُ النَّاسُ كَالْفَرَاشِ الْمَبْثُوْثِ ④

5 పర్వతాలు ఏకిన రంగు రంగుల దూది పింజాల్లా (లేక ఉన్నిలా) అయిపోతాయి.[3]

وَتَكُوْنُ الْجِبَالُ كَالْعِهْنِ الْمَنْفُوْشِ ⑤

1. **'అల్ ఖారియహ్'** ( الْقَارِعَةُ ) కూడా ప్రళయదినానికి గల అనేక పేర్లలో ఒక పేరు. ఉదాహరణకు : ఇంతకు ముందు వచ్చినట్టు 'అల్ హాఖ్ఖా', 'అస్సాఖ్ఖతు', 'అస్సాఅతు', అల్ వాఖియహ్ మొదలగునవి. 'అల్ ఖారియహ్' అంటే తట్టేది, బాదేది అని అసలు అర్థం. సాధారణంగా తలుపును నెమ్మదిగా తడితే దాన్ని తలుపు తట్టడం అంటారు. అదే ధబధబా, వేగంగా, నిరంతరం కొడితే దాన్ని తలుపు బాదడం అంటారు. అర్ధరాత్రి పూట ఇంట్లో అందరూ నిద్రపోతున్న సమయంలో ఎవరయినా అకస్మాత్తుగా తలుపుబాదితే ఏమవుతుందో ఊహించుకోండి. ఆ సమయంలో ఇంట్లోనివారు భయాందోళన చెందటం సహజం. ప్రళయదినాన్ని 'అల్ ఖారియహ్'గా వ్యవహరించటంలోని మర్మం అదే. అది ఎప్పుడు వచ్చినా అందరినీ కలవరపరచే విధంగానూ, గుండె దడ పెంచే విధంగానూ ఉంటుంది.

2. **'ఫరాష్'** అంటే చీకటిలో దీపం చుట్టూ పరిభ్రమించే ఉసుళ్లు, దీపపు పురుగులు, దోమలు అని అర్థం. ఒక పద్ధతీ పాడూ లేకుండా అవి జ్యోతిచుట్టూ తిరుగుతుంటాయి. ప్రళయదినాన మనుషుల పరిస్థితి కూడా ఇంచుమించు అంతే.

3. పర్వతాలు ఎంత స్థిరంగా తమ ఉనికిని చాటుకుంటూ ఉంటాయో అందరికీ తెలిసిందే. దేవుడు వాటిని గురించి దివ్య ఖుర్ఆన్‌లో చెబుతూ, మేము పర్వతాలను ఎలా మేకులుగా పాతిపెట్టామో గమనించటం లేదా? అన్నాడు. అటువంటి స్థిరమైన

| | |
|---|---|
| 6 ఎవరి త్రాసు పళ్ళాలు బరువుగా ఉంటాయో.[4] | فَاَمَّا مَنْ ثَقُلَتْ مَوَازِيْنُهٗ ۙ﴿٦﴾ |
| 7 అతను మనసు మెచ్చిన భోగభాగ్యాలతో కూడిన జీవితంలో ఉంటాడు.[5] | فَهُوَ فِيْ عِيْشَةٍ رَّاضِيَةٍ ؕ﴿٧﴾ |
| 8 మరెవరి త్రాసు పళ్ళాలు తేలికగా ఉంటాయో,[6] | وَاَمَّا مَنْ خَفَّتْ مَوَازِيْنُهٗ ۙ﴿٨﴾ |
| 9 అతని నివాస స్థానం 'హావియా' అవుతుంది.[7] | فَاُمُّهٗ هَاوِيَةٌ ؕ﴿٩﴾ |
| 10 అదేమిటో ('హావియా' అంటే ఏమిటో) నీకేం తెలుసు?[8] | وَمَاۤ اَدْرٰىكَ مَا هِيَهْ ؕ﴿١٠﴾ |

పర్వతాలే ఆనాడు పేకమేడల్లా కూలిపోయి, నుజ్జునుజ్జయిపోతాయి. ఏకిన ఉన్ని వలే గాలిలో ఎగిరిపోతాయి. దీన్నిబట్టి ఆ ప్రళయఘడియ ఎంత భయానకంగా ఉంటుందో అంచనా వేసుకోవచ్చు. రానున్న వాక్యాలలో కర్మల దృష్ట్యా రెండు వర్గాల పరిస్థితి ఎలా ఉంటుందో సంక్షిప్తంగా తెలుపబడింది.

4. **'మవాజీన్'** ( مَوَازِيْن ) అనేది **'మీజాన్'** కు బహువచనం. ఈ తక్కెడ పళ్ళెములలో సత్కర్మలు తూయబడతాయి. అల్ ఆరాఫ్ సూరా 8వ వచనం ద్వారా, అల్ కహఫ్ సూరా 105వ వచనం ద్వారా, అంబియా సూరా 47వ వచనం ద్వారా తెలుపబడినది కూడా ఇదే. మరి కొంతమంది విద్వాంసుల ప్రకారం ఇక్కడ 'మవాజీన్' అంటే అర్థం త్రాసుపళ్ళాలు కాదు, దైవసన్నిధిలో ప్రత్యేక ప్రాముఖ్యం గల సత్కర్మల బరువు అని భావం (ఫత్‌హుల్ ఖదీర్). కాని మొదటి అర్థమే సరైనది, ఎన్నదగినదీను. దీనిప్రకారం ఎవరి సత్కర్మలు అధికంగా ఉంటాయో, తూకం వేయబడినప్పుడు వారి సత్కర్మల పళ్ళెం బరువుగా ఉంటుంది.

5. అంటే – ఆ వ్యక్తి కోరుకున్నవి అతనికి ప్రాప్తిస్తాయి.

6. అంటే – సత్కర్మలకన్నా దుష్కర్మలు అధికంగా ఉన్న వ్యక్తి అన్నమాట! ఆ వ్యక్తి కర్మలు తూకం వేయబడినప్పుడు దుష్కర్మల పళ్ళెం వంగుతుంది.

7. **'హావియహ్'** అనేది నరకం పేర్లలో ఒకటి. 'హావియా' అంటే నరకంలో అత్యంత అడుగున ఉండే స్థలం. ఆ రోజు నరకవాసులు నరకంలోని లోతైన గోతిలో పడతారు.

8. నరకాగ్ని తీవ్రత గురించి అందరికీ అర్థమయ్యేలా చెప్పటానికి ఇక్కడ ఇలా ప్రశ్నించటం జరిగింది. నిజానికి దాని తీవ్రత మనిషి అంచనాలకు అందనిది. మానవ మేధ దాన్ని అంచనా వేయజాలదు.

| | |
|---|---|
| **11** అది దహించివేసే అగ్ని.[9] | نَارٌ حَامِيَةٌ ﴿١١﴾ |

9. హదీసులో తెలియజేయబడిన దాని ప్రకారం ప్రపంచంలో మనిషి మండించే అగ్ని తీవ్రత నరకాగ్ని తీవ్రతలో 70వ వంతు మాత్రమే. నరకాగ్ని తీవ్రత ఈ లోకంలోని అగ్నికన్నా 69 రెట్లు ఎక్కువ (సహీహ్ బుఖారీ – కితాబ్ బదవుల్ ఖల్ఖ్; సహీహ్ ముస్లిం – కితాబుల్ జన్నహ్). వేరొక హదీసు ప్రకారం ; అగ్ని తన ప్రభువుతో 'ప్రభూ! నాలోని ఒక భాగం మరోభాగాన్ని తినేస్తున్నది' అని విన్నవించుకున్నది. అప్పుడు పరమ ప్రభువు దానికి రెండుసార్లు నిట్టూర్చేందుకు అనుమతి ఇచ్చాడు. వాటిలో ఒకటి వేడిని బయటికి వదిలేది. రెండవది చల్లగా గాలివదిలేది. చల్లని గాలిని వదిలినప్పుడు తీవ్రమైన చలి వేస్తుంది. వేడి గాలిని వదిలినప్పుడు తీవ్రమైన ఎండలుంటాయి (సహీహ్ బుఖారీ). వేరొక హదీసులో మహనీయ ముహమ్మదు (సఅసం) వారు ఇలా ప్రవచించారు : "వేసవి తీవ్రంగా ఉన్నప్పుడు నమాజును, చల్లపడ్డాక చేయండి. ఎందుకంటే వేసవి తీవ్రతకు ముఖ్య కారణం నరక తాపమే." (ముస్లిం – కితాబుల్ మసాజిద్).